కానీ
ఈ ఒక్క కోరికా తీర్చు
చచ్చిపోయిన వాళ్ళు
దేవుడితో సమానమంట
నిన్ను దేవుడిగా ప్రార్థిస్తున్నాను
భగవాన్!
నన్ను తీసుకుపో

**(5.9.1996)**

## నా ఎలిజీ నేనే రాసుకోనా?

**శ**ర్మగారూ ! ఏవిఁటిది?
మీరేదో మంచివారనుకున్నాను
మీరు కూడా ఇలా చేశారేఁవిటీ !
నరసింగరావు వెళ్ళిపోయేడు
రాజేశ్వర్రావూ, రా.వి.శాస్త్రి కూడా వెళ్ళిపోయేరు
మరింక నేనూ వెళ్ళిపోతాను అనుకున్నారా?
బావుందండీ, చాలా వావుంది.
వాళ్లకి బుద్ధి లేకపోతే మీకూ లేదా?
ఇల్లాలి ముచ్చట్లు అంత చక్కగా రాసిన మీరు
మీ ఇల్లాలి మాటేం చేశేరు?
అంతేలెండి. అవన్నీ రాతలే మరి.
వెళిపోండి సార్, వెళిపోండి
మా కన్నీళ్లె వైతరణిగా.
మీకేం మొగమహారాజులు
ఎప్పుడు ఎక్కడికి వెళ్లాలనిపిస్తే అక్కడికి వెళ్ళిపోతారు
"సిరికిం చెప్పడు" పద్ధతిలో
ఔనుమరి విష్ణుమూర్తి మొగాడే కదా!
మీ మొగాళ్లంతా పరమ స్వార్థపరులు సార్
మీ సుఖం, మీ సంగతే చూసుకుంటారు
ఏఁవిటీ! నేనిలా అన్నానని మీ ఫ్రెండ్స్‌తో చెప్తారా?
చెప్పండి. చెప్పాలనే అంటున్నాను.
నాకేం భయంలేదు.
ఏం చేస్తారు?
శాస్త్రిగారు - పరమగడుసు - నవ్వి ఊరుకుంటారు.
రాజేశ్వర్రావుగారు - ఈయన లౌక్యుడు - పోన్లెస్తురూ
ఆడవాళ్లు అంతే - అంటారు
ఇంక నరసింగరావు - పరమ కోపిష్టి - ఇతను
మాత్రం అంతెత్తు ఎగురుతాడు
ఎంత చెప్పినా ఆడపుట్టుక కదా
పౌర్ణమినాడు సముద్రం పొంగినట్టు
గుండెలో బాధ పొంగుతుంటే ఏఁవీఁ చెయ్యలేక
ఏదో అన్నాను. ఏం అనుకోకండేం
పాతతరం వాళ్లం కదా
పట్టుకుని వేలాడుతున్నాం
కట్టుకున్న వాడి చుట్టూ బొంగరంలా తిరిగేం
తాడు తెగిపోయింది. బొంగరం ఆగిపోయింది
అందరం పోకతప్పదు
అదికాదు నా బాధ
నా వాళ్లు అనుకున్న వాళ్లంతా వెళిపోతే
నన్నెవరు పంపిస్తారు!
నన్నింక 'సుందరమ్మగారూ' అని ఎవరు పిలుస్తారు!
నా 'ఎలిజీ' నేనే రాసుకోనా?!

**(24.11.1996)**

## (నూ)రూకలిస్తాను మేకలు కాస్తావా?

**ఇ**దేఁవిటి? ఎండా? నిప్పా?
సూర్యుడు తగలబడిపోతున్నాడా?
పోతే పోనీ. పీడా వదిలిపోతుంది.

"కొంతమందికి అన్నీ ఉన్నా సుఖపడే యోగం ఉండదురా. ఆ జాతకాలు అంతే" అనేవారు మా నాన్న. అప్పుడది చాదస్తంగా కనిపించినా ఇప్పుడు నిజమేననిపిస్తోంది.

ఉద్యోగం మంచిదే. అయితే ఏం, ఎ.సిలు, ఎయిర్‌కూలర్లు లేకపోయినా, కనీసం నీడ పట్టున కూర్చునే యోగం కూడా లేదు నాకు.

ముక్కు, మొహం తేలీని ముండాకొడుకులందరికీ లక్షలు, కోట్లు అప్పులివ్వడం, సంవత్సరం చివర్న "పట్రండి, పట్రండి" అని మమ్మల్ని తోలడం.

అప్పు తీసుకున్నవాడికి తీర్చాలని తెలీదా?

ఎందుకు తెలీదూ. తెలుసూ

తీర్చడానికి మనసొప్పదు.

వాడు తీర్చడని తెలిసీ, మేము వాడి చుట్టూ వెర్రి వెధవల్లాగా తిరగటం, మేము వస్తున్నట్లు వాడికి ముందే ఉప్పంది వాడు తాళం వేసుకొని వెళ్లిపోవడం.

వీడెవడో కృష్ణమూర్తిట.

మధురలో ఉన్నాడా? ద్వారకలో ఉన్నాడా?

రెండోజుల్నుండి వెతుకుతున్నాం.

నాయనా కృష్ణా! కనిపించు, కరుణించు తండ్రీ!

ఎండకి ముక్కులోంచి ఆవిరి వస్తోంది.

కళ్ళల్లో నిప్పులు పెట్టినట్టుంది.

మేనేజరు మీది కోపంతో గుండెలో గాడిపొయ్యి మండిపోతోంది.

ఈ వేడికి బుర్ర పిచ్చెక్కిపోతుందో ఏవిటో!

అదే మంచిది.

అప్పుడు మా మేనేజరు బుర్ర బద్దలు కొట్టేస్తాను.

పిచ్చివాడ్ని కదా! కేసుండదు.

మహా అయితే పిచ్చాసుపత్రిలో పడేస్తారు.

పొద్దున్న ఎప్పుడో వేసుకున్న నాలుగు మెతుకులు. ఇంత వరకు అరకప్పు కాఫీ కూడా తాగలేదు. తీసుకొచ్చిన నీళ్ళు ఎప్పుడో అయిపోయేయి.

టాక్సీలో పెట్రోలు అయిపోతోందే తప్ప ఆ కృష్ణమూర్తి దర్శనం మాత్రం అవలేదు.

అసలా ఊరు ఈ జిల్లాలోనే ఉందా?

పొరపాటున పొరుగు జిల్లా వాడికి అప్పు ఇవ్వలేదు కదా!

ఎప్పుడైనా దక్షిణ మరచిపోయినా పూజారి ప్రసాదం ఇస్తాడేమో కాని, మా బాస్ మాత్రం నోటు పెట్టకపోతే నోట్ కదపడు. అది అతని వ్రతం. ఎప్పుడూ వ్రతభంగం చెయ్యడు మరి.

వేలు పుచ్చుకోవటం – లక్షలిచ్చీడం

లక్షలు పుచ్చుకోవడం – కోట్లు ఇచ్చీడం

ఆఖర్న నువ్విన్ని లక్షలు వసూలు చెయ్యి, నువ్విన్ని కోట్లు వసూలు చెయ్యి అని మమ్మల్ని తోలడం.

అందుకే ఈ ఫైనాన్షియల్ సంస్థలన్నీ ఇలా తగల బడ్డాయి. ఎడ్రసులేని వాడికి కట్టలిచ్చేస్తే ఏమౌతుంది?

ఏవుంది? ఆగిపోతుంది.

ఆగిపోయింది.

ఫైనాన్షియల్ సంస్థ కాదు. మా టాక్సీ.

డ్రైవర్ దిగి బానెట్ ఎత్తేడు. ఇంజన్లోంచి ఇల్లు తగలబడి పోతున్నట్లు పొగలు వచ్చేస్తున్నాయి.

ఇంజను వేడెక్కిపోయింది సార్. రేడియేటర్లో నీళ్ళు పొయ్యాలి. అని ఓ ఖాళీ డబ్బా పట్టుకొని బైల్దేరాడు. నేనూ, నా కొలీగ్స్ కూడా దిగేం.

చుట్టూకొండలు.

రాళ్ళు, గుట్టలు అన్నీ క్షవరం చేసినట్టు నున్నగా ఉన్నాయి. చెట్లు కాదు గదా ఎక్కడా గడ్డిపరక్కూడా లేదు.

ఇక్కడ నీళ్ళెక్కడ దొరుకుతాయి?

తండ్రీ! కృష్ణమూర్తి! ఏమిటయ్యా మాకీ పరీక్ష! ఈ ఉద్యోగం చెయ్యడమే మేము చేసిన పాపమా?

అలనాడు గజేంద్రుడ్ని రక్షించడానికి విష్ణుమూర్తి తన వెంటనే సిరి వగైరాలు రాగా బైల్దేరేడు.

అలాగే నీళ్ళవేటకి ముందు డబ్బాలో డ్రైవరు, వెనక మేము బైల్దేరేం.

జోళ్ళున్నా ఆ వేడికి కాళ్ళు కాలిపోతున్నాయి.

నడవగా... నడవగా దూరంగా ఒకమ్మాయి ఎండు పుల్లలు ఏరుకుంటూ కనిపించింది.

ఇంత ఎండలో ...ఎవరూ లేని చోట... ఒకమ్మాయి దెయ్యం కాదు కదా .. భయపడ్డాడు మా కొలీగ్‌కామేశం. అతనికి విపరీత మైన దెయ్యం భయం.

“ఛ!” ఇంత ఎండలో దెయ్యమేమిటి? విసుకున్నాడు విశ్వనాథం.

“దెయ్యానికి ఎండేమిటి?” గొణిగేడుకామేశం.

చుట్టూ ఎక్కడా చెట్టులేకపోయినా, అప్పుడే చిగిర్చిన చింత చెట్టులా ఉందా అమ్మాయి.

ఆకు ఆకుకీ మొగ్గ తొడిగిన మల్లెపందిరిలా ఉంది.

“చూడమ్మా...” నేనే పలకరించేను. చూసింది ఎవరీ ముష్క రులన్నట్టు.

“ఇక్కడెక్కడైనా నీళ్ళు దొరుకుతాయా?” వాక్యం పూర్తిచేశాను.

నేనేదో అడక్కూడనిది అడిగినట్టు ముందు తెల్లబోయింది.

“నీళ్ళమ్మా.. నీళ్ళు” గట్టిగా అడిగేను.

“ఓహో” అన్నట్టు తలాడించి “అల్లదుగో ఆడ బావి ఉంది” అంది దూరంగా చూపిస్తూ...

మళ్ళీ నడక.

వెళ్ళగా, వెళ్ళగా, ఒక చిన్న గట్టులాంటిది కనిపించింది.

లోపలికి తొంగి చూశాం. చీకటి.

ఏదైనా సొరంగమార్గమా? చుట్టు ప్రక్కల ఎక్కడా శిధిలమై పోయిన కోట ఆనవాళ్ళు ఏం లేవు. అంచేత ఇది సొరంగం కాదు. బావి అయి ఉండాలి. నీళ్ళున్నాయో లేదో?

డ్రైవరుకి కాకి, కూజా కథ జ్ఞాపకం వచ్చినట్టుంది.

రెండు రాళ్ళు విసిరేడు.

నీటి శబ్ధం వినిపించింది.

కాకి కథలోలాగా నీళ్ళు పైకి వచ్చే వరకు అలా రాళ్ళు విసరడమేనా? తోడడానికేదైనా ఉందా?

బావి చుట్టూ ప్రదక్షిణ చేసేం.

థాంక్ గాడ్!

ఒక తుప్పు పట్టిన బకెట్, పదిమైళ్ళ తాడు కనిపించేయి. బకెట్‌కి అడుగున చిన్న కన్నం ఉంది.

ముగ్గురం కలిసి ఆ పది మైళ్ళ తాడులాగగా, లాగగా కారినవి కారగా, అరగ్లాసు నీళ్ళు మిగులుతున్నాయి.

మొత్తానికి ఎలాగైతేనేం అరగంట తోడగా డబ్బా నిండింది. ఆ డబ్బాడు నీళ్ళు దాహం పుచ్చుకుని కారు కదిలింది.

మళ్ళీ ఆ అమ్మాయి దగ్గరకే వెళ్ళి ఫలానా ఊరు ఎక్కడుందని అడిగేను.

దూరంగా లక్కపిడతల్లా కనిపించే పాకలు చూపించింది.

సరే మళ్ళీ బైల్దేరేం.

తోవలో ఒకపాడు పడిన ఇల్లులాంటిది కనిపించింది. దిగి చూశాం. తలుపులు, ద్వారాలు లేవు, టాపు కూడా లేదు. లోపల గోడ మూలని ఒక చిన్న కుక్కపిల్ల నిద్రపోతోంది. చప్పుడుకి ఒక కన్ను మాత్రం విప్పి మీరా! ఎవరో అనుకున్నాను అన్నట్టు చూసి మళ్ళీ కన్ను మూసేసుకుంది. కిటికీ మీద కూర్చున్న ఉడత పిల్ల మాత్రం మమ్మల్ని చూసి ఛంగున గెంతేసింది. నేలని ఒక మూలపడున్న ఒక చెక్క ముక్కను తీసిన కామేశం ‘యురేకా! అని గావుకేక పెట్టేడు.

సీతాదేవిని వెతుక్కుంటూ వెళ్ళిన శ్రీరాముడికి సుగ్రీవుడు కనిపించి సీత నగలు చూపించినప్పుడు రాముడికి కలిగిన ఆనందమే మాకూ కలిగింది.

హమ్మయ్య మనక్కావల్సిన ఆసామీ ఈ చుట్టుప్రక్కలే ఉన్నాడు. కొంచెం హుషారొచ్చింది. పాకల దగ్గరికి వెళ్ళాం. అక్కడక్కడ ఒకటి రెండు పెంకుటిళ్ళు ఉన్నాయి. పాకలవతల కొండ. ఆ కొండమీద మాత్రం అక్కడక్కడ మొక్కలున్నాయి.

ఆ కొండమీద మేస్తున్న ఆవులు, గేదెలు, మేకలు ఎవరో దేవతలు పెట్టిన చుక్కల ముగ్గుల్లా ఉన్నాయి. పాకలకి కొంచెం దూరంలో అమ్మవారి గుడి ఉంది. దాని చుట్టూ పసుపు, కుంకుం రాసిన ఆనవాళ్ళున్నాయి. కాబట్టి అది గుడి అనుకోవాలి కాని లేకపోతే ఎవరిదో సగం కట్టి వదిలేసిన సమాధిలా ఉంది.

ఎండకి వేడెక్కిపోయిన బుర్రమీద వెన్నపెడితే నెయ్యి అయి పోతుంది.

పాలు పెడితే పెరుగు అయిపోతాయి.

“పోదాం సార్ బతికుంటే మరోనాడు వద్దాం” అన్నాడు విశ్వనాథం. అతని గుండె గొంతుకలో కొట్టుకుంటోంది.

ఔను ఎవరీ కృష్ణమూర్తి?

ఏవాఁ కథ?

ఆ కథాక్రమంబెట్టిదన –

ఈ మధ్య చదువులెక్కువైపోయేయి. ఉద్యోగాల్లేవు. పనీపాటా లేని జనం పిల్లల్ని కనేస్తున్నారు. దాంతో జనాభా పెరిగిపోతోంది. దేన్నీ అదుపులో పెట్టలేకపోతున్నారు.

నిరుద్యోగులు ఆటంబాంబు కంటే ప్రమాదమైన వాళ్ళు.

ఏం చెయ్యాల్లో తోచని ప్రభుత్వం తల్లడిల్లిపోయింది. అలా తల్లడిల్లగా తల్లడిల్లగా ఒక ఉపాయం తోచింది. అదే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీము.

"బాబ్బాబు, మమ్మల్ని ఉద్యోగాలడక్కండి. అప్పులిస్తాం. ఆడవాళ్ళకైతే కొంత సబ్సిడీ ఇస్తాం. వడ్డీ తగ్గిస్తాం. చక్కగా వ్యాపారం చేసుకోండి" అంది.

ఇదేదో బావుందనిపించింది చాలామందికి. లాభసాటిగా అనిపించింది వ్యాపారస్తులకి. ఇంకేం? తల్లి పేర, చెల్లి పేర, పనిమనిషి పేర, అందరి పేర్లతో అప్పుడు ఎడాపెడా తీసేసు కున్నారు. అయితే అప్పు తీర్చాలంటే మనసొప్పలేదు.

ఎలా? డబ్బు పారేసి, పెద్ద బుర్రల చేత ఫోన్లు చేయించేరు. ఫోన్లో సలాం కొట్టిన మేనేజరు మామీద దండెత్తి, పోయి డబ్బు వసూలు చేసుకొని రమ్మని మమ్మల్ని తోలడం, ఇది రివాజై పోయింది. ఇదిగో మేమిలా కాకుల్లా ఎండన పడి తిరగటం, ఇదీ తతంగం. ఈ తతంగంలో భాగమే ఈ కృష్ణమూర్తి వేట.

ఇందాకటి అమ్మాయి పుల్లల మోపు నెత్తిన పెట్టుకొని వెళ్తోంది.

"ఫలానా కృష్ణమూర్తి ఇల్లు తెలుసా?" అనడిగేం.

అదేదో జోకులాగా పగలబడి నవ్వింది.

ఎండకి మండిపోతున్న మా మొహాల మీద మల్లెపూల వాన పడినట్టుంది ఆ నవ్వు.

మండుటెండలో మలయమారుతంలా ఉందా నవ్వు.

"ఆడా! కిట్టప్పగాడా! అల్లదుగో. ఆ కొండ మీదున్నాడు" అంది నవ్వు ఆపి.

"అక్కడేం చేస్తున్నాడు?"

"బాగుంది. ఏటిసేస్తాడు? మేకలు కాస్తాడు."

"పీకలు కొయ్యడా?" కసిరేడు విశ్వనాథం.

"ఏటి బాబూ?" అందామ్మాయి.

"ఏం లేదులే. అతని ఇల్లు ఎక్కడుంది?" అడిగేను.

"అదిగో ఆ పాకల్లో అడగండి" అంది వెళ్ళిపోతై.

అలనాడు ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు గోవుల్ని కాస్తే, ఈ యుగంలో ఈ కృష్ణుడు మేకల్ని కాస్తున్నాడు.

హే కృష్ణ పరమాత్మా! ఏమిటయ్యా నీ లీలలు!?

సారీ స్క్రీన్ ప్రింటింగ్ కని అప్పు తీసుకోవటమేమిటి?

ఈ మేకలు కాయటమేమిటి?

ఏమిటో తెలుసుకోవడానికి పాకల దగ్గరకి వెళ్ళేం. ఎక్కడా నర సంచారం లేదు.

అన్ని ఇళ్ళు తలుపులూ తీసే ఉన్నాయి.

ఒక పాక ముందు నిల్చుని ఎవరండీ లోపల పిల్చేను.

రెండు నిమిషాలు నిశ్శబ్దం.

మూడో నిమిషంలో నేను అంటూ ఒక పెద్దకోడి లోపల్నుండి ఛంగున మా నెత్తిమీద నుండి గెంతి పారిపోవటం, కామేశం కెవ్వుమనడం ఒక్కసారే జరిగేయి.

అదేవిఁటండీ బాబు! అదేవిఁటి కోడా? కుక్కా? అంతుం దేమిటి? విశ్వనాథం విస్తుపోయాడు.

"హైబ్రిడ్ వెరైటీ అయుంటుంది?" మళ్ళీ అతనే అన్నాడు.

మరింక ఏ ఇంట్లో ఏం గెంతుతుందోనని ఎక్కడా ఆడగలేదు. చివర పాక ముందే అరుగు మీద ఒక ముసలమ్మ పడుకుంది.

ఈవిడ్ని లేపితే ఏం తిడుతుందో?

కాని అదృష్టం, అవిడే లేచా "ఎవరు బాబూ" అంది.

"కిట్టప్ప ఇల్లు ఇదేనా అమ్మా?" అడిగేను.

"నా కొడుకే బాబూ, ఏటి సేసేడు బాబూ?" ఆత్రంగా అడిగింది.

"ఏం లేదులే. రేపొకసారి పట్నంలో మా ఆఫీసుకి వచ్చి కలియమను" అన్నాడు కామేశం.

"ఆడికేటీ తెల్దుబాబు, మేకల్లో మేకలాటోడు" అంది ఏడుపు గొంతుకతో.

"ఏం లేదు. ఓసారి రమ్మను" అని కారు దగ్గరకి వెళ్ళాం.

రూల్సు ప్రకారం అప్పు తీర్చకపోతే వాడి యూనిట్ సీల్ చెయ్యాలి. వాడి ఆస్తి సీల్ చెయ్యాలి. వీడి ఆస్థి పాతిక మేకలు. వాటిని తీసికెళ్ళాలా?

కురుక్షేత్రంలో అర్జునుడికి శ్రీకృష్ణుడికి విశ్వరూప దర్శనం అయినట్లు. మర్నాడు పొద్దున్నే మాకు ఈ కృష్ణుడి దర్శనం అయింది.

జన్మతరించింది.

"డబ్బుకట్టవేఁటయ్యా?" అడిగేం.

"డబ్బేంటండీ?" అన్నాడు.

"మరి అప్పుడు అన్ని లక్షలు పుచ్చుకున్నావ్?" కసిరేడు కామేశం.

అతను తొణకలేదు. బెదరలేదు!.

అచ్చు మేకలాగే నవ్వేడు (మేకలు నవ్వవు. కాని అతని నవ్వులో అమాయకత్వం మేకని గుర్తుచేస్తుంది. అంతే!).

బావుందండి. ఆ నాను డబ్బు తీసుకోవటవేంటండి? ఆ ఎంకటేశం బాబొచ్చి "ఒరే కిట్టప్పా! సర్కారోళ్ళు నీలాటోళ్ళందరికీ మేకలు ఊరికే ఇస్తున్నారు. సంతకం ఎట్టు అన్నాడండి. నాకేటి ఎరికండి? ఎట్టేసినానండి. అంతే!" అన్నాడు.

"నీకు సంతకం పెట్టడం కూడా వచ్చునా కృష్ణావతారం?" విశ్వ నాథం విసుక్కున్నాడు.

"ఆ బాబే నేర్పినాడండి"

"ఏడీవాడు"

"నాకేటి ఎరికండి?" అదీ

ముల్లుకు కత్తి వచ్చె ఢాం ఢాం అని పిచిక కథలాగ మూడు లక్షలకి ముప్పై మేకలు వచ్చేయి ఢాం ఢాం అని డప్పుకొట్టు కుంటూ మర్నాడు మరో అప్పు వసూలుకి బైల్దేరేం.

ఏ గేదెల వాడు తగుల్తాడో!

"పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్" అన్నది గిరీశం నాటి మాట.

"లంచం తీసుకోని వాడు అడ్డగాడిదై పుట్టున్" అన్నది ఈనాటి మాట. అందుకేనేమో కరప్షన్ ఈజ్ గ్లోబల్ ఫినామినా అన్నది ఇందిరాగాంధీ!.

**(ఆంధ్రప్రభ, వారపత్రిక, 26.6.1996)**

# పిచ్చిపక్షి

**అ**ప్పటికింకా డెమోక్రసీ రాలేదు.

బ్రిటీషువారూ రాలేదు.

రాజులే రాజ్యం ఏలుతున్నారు.

అనగా అనగా ఓ రాజుగారు.

ఆ రాజుగారు ఓ నాటి సభలో తీరిగ్గా ఆసీనులై, మంత్రి వగైరాలతో తమ ప్రజల యోగక్షేమం చర్చిస్తున్నారు.

(డెమోక్రసీ వచ్చాక ప్రభువులు ప్రజల యోగక్షేమాలు చర్చిం చడం మానేశారు)

చర్చ చాలా సీరియస్‌గా సాగుతోంది.

ఇంతలో ....

దూరంగా పెద్ద గోల.

ఆ గోలేఁవిటో చూసిరమ్మని మంత్రిగారు భటుల్ని తక్షణం పంపించేశారు.

భటులింకా ద్వారం దాటనేలేదు.

ద్వారపాలకుల మాట లెక్కచెయ్యకుండా ఒక పెద్ద నెమళ్ల మంద సభలో కొచ్చేసింది.

ఒక్క నిముషం సభంతా నిశ్శబ్దం.

రాజుగారువిచిత్రంగా చూస్తున్నారు.

సభలోకి ప్రజలు తప్ప ఇలా నెమళ్ళు లేళ్లు రావటం ఇంత వరకు జరగలేదు.

"ఏఁవిటి మీ సమస్య?" అడిగారు మంత్రిగారు

ఆ రాజుల్లో రాజులకి, మంత్రులకి మానవ భాషే కాకుండా జంతుభాష, పక్షిభాష కూడా వచ్చేవి.

సభంతా నిశ్శబ్దం.

ఒక ముసలి నెమలి – అది లీడరు –

ముందుకొచ్చి సాష్టాంగ నమస్కారం చేసింది.

దాని వినయానికి అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ వేలు తీసే లోపల అది మంత్రిగారికి మామూలు నమస్కారం చేసింది.

సభికులు మళ్లీ ఆశ్చర్యపోయారు.

తరువాత ఆ నెమలి కొంచెం రాజుగారికి దగ్గరగా వచ్చి చేతులు కట్టుకుని చెప్పింది –

"మహాప్రభో! తవఁరు ధర్మ ప్రభువులు. తమ రాజ్యంలో కష్టాలు లేవని ప్రజలు అనుకుంటున్నారు. మాకు మాత్రం తగని కష్టం వచ్చింది. తవఁరే తీర్చాలి!" అని ఎఫెక్టు కోసం ఆగింది.

మిగతా నెమళ్లు కళ్లు ఒత్తుకున్నాయి.